ఆంధ్రజ్యోతి ***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 6 జూన్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.172	242	272
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 24.0



ఉమ్మడి జిల్లాలో పైచేయి

- భారీ మెజార్టీలతో ఎంపీ సీట్లు కైవసం
- అనూహ్యంగా రెండోస్థానంలోకి వచ్చిన బీజేపీ
- బీఆర్ఎస్‌కు భారీగా తగ్గిన ఓటింగ్
- బీజేపీకి క్రాస్ అయినట్లుగా అంచనా

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా మరోసారి రుజువు కాగా, పోటీగా మరో జాతీయ పార్టీ బీజేపీ పట్టు పెంచుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఏడు శాతానికి లోపే ఓటు బ్యాంకు ఉన్న కమలం పార్టీ ఆరు నెలల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఆవిర్భవించింది. అసెంబ్లీ ఎన్నికలవరకు కాంగ్రెస్‌కు దీటుగా ఉన్న బీఆర్ఎస్ చతికిలపడి ఊహించని విధంగా మూడో స్థానానికి పడిపోయింది. బీఆర్ఎస్ స్థానంలోకి బీజేపీ వచ్చి చేరింది. ఒకప్పుడు నల్లగొండ అంటే గుర్తుకొచ్చే కమ్యూనిస్టు పార్టీలు ఉనికిని కాపాడుకునే పరిస్థితి నెలకొంది. రెండు లోక్‌సభ స్థానాల నుంచి గెలుపొందిన నేతలిద్దరూ రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి గతంలో ఎవ్వరూ సాధించని మెజార్టీతో లోక్‌సభలో అడుగుపెడుతున్నారు.

రెండో స్థానంలో నిలిచిన బీజేపీ

లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌ని తోసిరాజని బీజేపీ రెండోస్థానానికి ఎగబాకింది. ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు శాతానికి పరిమితమైన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకుంది. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో ఉండడంతో పాటు బలమైన ఓటు బ్యాంకు సాధించిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో వెనుకబడింది. ఉమ్మడి జిల్లాలో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లో బీజేపీ రెండో స్థానంలో నిలిస్తే, నల్లగొండ పార్లమెంట్‌లో నల్లగొండ, మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండో స్థానానికి వచ్చింది. సూర్యాపేట, తుంగతుర్తి, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, కోదాడ, దేవరకొండ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ద్వితీయ స్థానం కొనసాగించింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ సంప్రదాయ ఓటర్లు బీజేపీవైపు మళ్లారని అంతా అంచనా వేస్తున్నారు. ఇదే ఊపును బీజేపీ కొనసాగిస్తుందా? పార్టీని అన్ని స్థాయిలకు విస్తరించడంతో పాటు, స్థానిక నేతలకు ప్రాధాన్యమివ్వడం, రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రజా సమస్యలపై దీటుగా పోరాడే నాయకత్వాన్ని ప్రోత్సహిస్తే తప్ప బీజేపీ ఉమ్మడి జిల్లాలో పుంజుకోవడానికి అవకాశం లేదని విశ్లేషకులు చెబుతున్నారు.

పంతం నెగ్గించుకున్నారు

అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీలతో జిల్లాలోని 11 స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్, అదే వ్యూహంతో పార్లమెంటు స్థానాలను గెలిచింది. జాతీయస్థాయిలో అత్యధిక మెజార్టీ సాధిస్తామని ప్రతినబూనిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచి, ప్రస్తుతం మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అధిష్ఠానం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో ఈ ఎన్నికను ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రులు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి, జైవీర్‌రెడ్డి, బాలూ నాయక్, బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి అసెంబ్లీ ఎన్నికలకు మించిన మెజార్టీలను అన్ని నియోజకవర్గా ల్లో వచ్చేలా పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిన సూర్యాపేట నియోజకవర్గంలోనూ పార్టీ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ దక్కింది. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో అసెంబ్లీ కంటే అదనపు మెజార్టీలు వచ్చాయి. భువనగిరికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉండగా, అభ్యర్థి గెలుపు బాధ్యతను ఆయన భుజస్కంధాలపై పెట్టారు. ఎమ్మెల్యేలను, పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేస్తూ కిరణ్‌కుమార్‌రెడ్డి విజయానికి బాటలు వేశారు. ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, మందుల సామేల్, వేముల వీరేశం, మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు నాయకులు, క్యాడర్‌ను సమన్వయం చేసుకుంటూ బూత్‌ల వారీగా, గ్రామాల వారీగా పటిష్ఠ పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహించారు. దీంతో గతంలో రానంత మెజార్టీ వచ్చింది.





ఫలించిన జానారెడ్డి వ్యూహం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తనదైన మార్క్‌తో రాజకీయాలను శాసించిన నేతగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి పేరుంది. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఒక సారి సమితి అధ్యక్షుడిగా, ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవడం, ఉమ్మడి రాష్ట్రంలో అత్యధిక కాలం మంత్రిగా పనిచేసిన అనుభవం, ఏ మంత్రి నిర్వహించనన్ని శాఖలను నిర్వహించిన తీరుతో పాటు రాష్ట్ర ఏర్పాటయ్యాక ప్రతిపక్ష నేతగానూ ఆయన తనదైన ముద్ర చాటుకున్నారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించిన జానారెడ్డి, తెలంగాణ కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా నిలిచారు. ఆయన పోటీ నుంచి తప్పుకొని తన కుమారులిద్దరినీ ప్రత్యక్ష రాజకీయాల్లో నిలబెట్టారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో నాగార్జునసాగర్ అసెంబ్లీ స్థానం నుంచి చిన్నకుమారుడు జైవీర్‌రెడ్డిని బరిలో నిలిపి భారీ మెజార్టీతో అసెంబ్లీకి పంపారు. తాజాగా, లోక్‌సభ ఎన్నికల్లో పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డికి నల్లగొండ ఎంపీ టికెట్ ఇప్పించి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో ఢిల్లీకి పంపుతున్నారు. ప్రత్యక్ష ఎన్నికల నుంచి తప్పుకొని ఇద్దరు కుమారులను ఆరు నెలల సమయంలో చట్టసభలకు పంపడం ద్వారా రాజకీయాల్లో తన వారసత్వాన్ని జానారెడ్డి కొనసాగించినట్లయింది. 2014 నుంచి మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని పెద్ద కుమారుడు రఘువీర్ ప్రయత్నిస్తున్నప్పటికీ సాధ్యపడలేదు. తాజాగా, నల్లగొండ ఎంపీగా ఆయనకు అవకాశం దక్కి, తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు.

యాదాద్రి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): భువనగిరి కేంద్రంగా ఎన్నో ఉద్యమాలు ఊపిరి పోసుకున్నాయి. భూమి కోసం, భుక్తి కోసం జరిగిన పలు ఉద్యమాలకు వేదిక ఈ ప్రాంతం. మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ కీలక భూమిక పోషించింది. భువనగిరి ఖిల్లాపై జెండా ఎగురవేయాలని ప్రధాన పార్టీలు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో అధికార, విపక్ష నేతల మధ్య సవాళ్ల ప్రతిసవాళ్లతో రాజకీయ యుద్ధం నడిచింది. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని కాంగ్రెస్, జెండా పాతాలని బీజేపీ, పూర్వ వైభవాన్ని చాటాలని బీఆర్ఎస్ ముమ్మర ప్రయత్నాలు చేశాయి. నెల రోజులు పాటు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ అగ్రనేతలంతా విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేష్, బీజేపీ నుంచి బూర నర్సయ్యగౌడ్, సీపీఎం నుంచి ఎండీ.జహంగీర్‌తో పాటు మొత్తం 39మంది అభ్యర్థులు బరిలో దిగారు. మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పైచేయి సాధించి సిట్టింగ్ స్థానాన్ని మరోసారి నిలుపుకుంది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇస్తాయని ఊహించగా, 2.22లక్షల మెజార్టీతో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారు.

సవాల్‌గా తీసుకున్న ఎమ్మెల్యేలు

భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించే బాధ్యతను కాంగ్రెస్ అధిష్ఠానం జిల్లా ఎమ్మెల్యేలకు అప్పగించింది. దీంతో వారు సవాల్‌గా తీసుకున్నారు. భువనగిరి నియోజకవర్గం పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ఒక్క జనగామ మినహా ఇబ్రహీంపట్నం, భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. గతంలో ఎంపీగా పనిచేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం వ్యూహాత్మకంగా నియోజకవర్గ ఇన్‌చార్జీ బాధ్యతను అప్పగించింది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని తుంగతుర్తిలో 70,163 ఓట్ల మెజార్టీ, మునుగోడులో 53,706, నకిరేకల్‌లో 37,683, జనగామలో 31,235, ఆలేరులో 15,260, భువనగిరిలో 10,273, ఇబ్రహీంపట్నంలో 3,969 ఓట్ల మెజార్టీ కాంగ్రెస్ అభ్యర్థికి లభించింది.

గత ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ

భువనగిరి నియోజకవర్గం ఏర్పడ్డాక తొలిసారి కాంగ్రెస్ నుంచి ఎంపీగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలుపొందారు. నాడు 1,39,978 ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు. 2014లో టీఆర్ఎస్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ 30,494ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 5,119 ఓట్లతో గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి 2,22,170 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు.

బీఆర్ఎస్‌కు భారీగా తగ్గిన ఓటింగ్

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నల్లగొండ లోక్‌సభ స్థానాన్ని మార్పు చేసి, 2008లో భువనగిరి నియోజకవర్గం ఏర్పడింది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 18,04,930మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్‌కు ఓటింగ్‌శాతం గణనీయంగా తగ్గింది. అది బీజేపీకి కొంత మేర బదలాయింపు జరిగినట్లు అంచనా. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఏడు నియోజకవర్గాల్లో 8,17,279 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థులకు 5,60,002 ఓట్లు, బీజేపీ అభ్యర్థులకు 74,482 ఓట్లు వచ్చాయి. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 6,29,143 ఓట్లు (44.99శాతం), బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు 4,06,973 ఓట్లు (29.04శాతం), బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ కు 2,56,187 ఓట్లు (18.28శాతం), సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌కు 28,730 ఓట్లు (2.05శాతం) వచ్చాయి. నోటాకు 4,646 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్‌కు 3,03,815ఓట్లు తగ్గాయి. అయితే బీజేపీకి గణనీయంగా 3,32,491 ఓట్లు పెరిగాయి. తెలంగాణలో గెలిచే స్థానాల్లో భువనగిరి కూడా ఉండాలని ఈ స్థానానికి బీజేపీ ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలో కేంద్రమంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నారు.



భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

భువనగిరి పార్లమెంట్ పరిధిలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్ అభ్యర్థి	వచ్చిన ఓట్లు	బీఆర్ఎస్ అభ్యర్థి	వచ్చిన ఓట్లు	బీజేపీ అభ్యర్థి	వచ్చిన ఓట్లు
భువనగిరి	అనిల్‌కుమార్‌రెడ్డి	1,02,742	పైళ్ల శేఖర్‌రెడ్డి	76,541	నారాయణరెడ్డి	9,200
ఆలేరు	బీర్ల అయిలయ్య	1,22,140	గొంగిడి సునీత	72,504	పడాల శ్రీనివాస్	9,659
నకిరేకల్	వేముల వీరేశం	1,33,540	చిరుమర్తి లింగయ్య	64,701	నకిరెకంటి మొగులయ్య	5,668
మునుగోడు	రాజగోపాల్‌రెడ్డి	1,19,624	ప్రభాకర్‌రెడ్డి	79,034	చెలిమెల కృష్ణారెడి	22,319
తుంగతుర్తి	మందుల సామెల్	1,29,535	గాదరి కిషోర్‌కుమార్	78,441	కడియం రాంచంద్రయ్య	4,412
ఇబ్రహీంపట్నం	మల్‌రెడ్డి రంగారెడ్డి	1,26,506	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	89,806	నోముల దయానంద్	15,490
జనగామ	కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి	83,192	పల్లె రాజేశ్వర్‌రెడ్డి	98,975	ఆరుట్ల దేశమంతారెడ్డి	7,734
	మొత్తం	8,17,279	మొత్తం	5,60,002	మొత్తం	74,482

పారని బీజేపీ పాచిక

నైతిక విజయం ఇండియా కూటమిదే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జూన్ 5: ఎన్నికల ముందు అయోధ్యలో ఆలయం కట్టి రాముని పేరుతో ఓట్లు దండుకోవడానికి బీజేపీ, ప్రధాన మంత్రి మోదీ వేసిన పాచిక పారలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 400 ఎంపీ స్థానాలు గెలుస్తామని చెప్పిన మోదీ 240 స్థానాలకే పరిమితమయ్యారన్నారు.మతం, దేవుడి పేరుతో ఓ వర్గం ఓట్లు కొల్లగొట్టడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలను ప్రజలు వమ్ము చేశారని అన్నారు.బాలరాముడిని కొలువుంచిన అయోధ్యలో బీజేపీ అభ్యర్థిని ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని ప్రజలు గెలిపించారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే ఇండియా కూటమి మరో 10 సీట్లు గెలిచేదని అన్నారు. దేశంలో మోదీ పలుకుబడి తగ్గిందని అన్నారు. మోదీతో ఇబ్బందులకు గురైన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, బీహార్‌లో నితీష్‌కుమార్ సెక్యులరిజం, రాజ్యాంగ రక్షణ కోసం ఇండియా కూటమికి మద్దతు తెలిపి మోదీ నిరంకుశత్వానికి అడ్డుకట్టవేయాలన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ గెలవదని తెలిసే బీజేపీకి ఓట్లు ట్రాన్స్‌ఫర్ చేశారని అన్నారు. బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవకపోవడం, బీజేపీకి 8 సీట్లు రావడానికి ఇదే నిదర్శనమన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యధిక మెజార్టీతో నల్లగొండ పార్లమెంట్ సీటును కాంగ్రెస్ గెలుచుకుందని అన్నారు. భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయకుండా 20,730 ఓట్లు సాధించడం గొప్ప విషయమన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రజలతో కలిసి పనిచేయాలని సూచించారు. సమావేశంలో సీపీఎం నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, భవాండ్ల పాండుపాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి



చిట్యాలలో ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

చిట్యాల, జూన్ 5: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి ఆదేశించారు. బుధవారం చిట్యాలలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ అందించాలన్నారు. ఈ నెల 6 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కూకుట్ల నర్సింహ, డీఈఈ ఆర్.మహేష్, ఏఈ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- పోలైన ఓట్లు 3.36లక్షలు
- 96 టేబుల్స్‌పై కౌంటింగ్
- ఒక్కో రౌండ్‌లో 96వేల ఓట్ల లెక్కింపు
- రెండు బ్యాచ్‌లుగా అధికారులు, సిబ్బంది నియామకం



జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక కౌంటింగ్‌లో మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు సుదీర్ఘంగా సాగుతోంది. 96వేల ఓట్లు లెక్కింపు చేపట్టిన మొదటి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిపై ఆధిక్యతలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆయనకు 6వేల పైచిలుకు ఆధిక్యత మొదటి రౌండ్లో వచ్చినట్లు సమాచారం. అయితే చెల్లని ఓట్ల పరిశీలనకు ఎక్కువ సమయం పడుతుండటం వల్లే మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ఆలస్యంగా సాగిందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఇద్దరు అభ్యర్థుల తరువాత బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్‌కు అధిక ఓట్లు వచ్చినట్లు సమాచారం. మొదటి రౌండ్లో మొత్తం 96వేల ఓట్లు లెక్కించారు. ఈ ఎన్నికలో 52మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 4.63లక్షల ఓట్లు ఉండగా, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. గురువారం సాయంత్రానికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉంది. మొదటి ప్రాధాన్య ఓట్లలో కోటా ఓటు (చెల్లిన ఓట్లలో 50శాతం+1) ఏ అభ్యర్థికీ రాకపోతే రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు.

96 టేబుల్స్‌పై కౌంటింగ్

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కోసం 96 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద ఒక్కో రౌండ్‌లో 1,000 ఓట్లను లెక్కిస్తారు. ఈ లెక్కన ఒక్క రౌండ్‌కు 96వేల ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లలో పూర్తికానుంది. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవ్వరికీ కోటా ఓటు (చెల్లిన ఓట్లలో 50శాతానికి అదనంగా ఒక ఓటు) రాకపోతే ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ సరళిని అంచనా వేసిన విశ్లేషకులు ద్వితీయ ప్రాధాన్య ఓట్లతోనే ఫలితం వెలువడుతుందని పేర్కొంటున్నారు. ఓట్ల లెక్కింపు గురువారం రాత్రికి పూర్తయ్యే అవకాశం ఉందని అంచనా.

కౌంటింగ్ నిరంతరాయంగా సాగేలా

కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగనుండడంతో ఎక్కడా ఆటంకం లే కుండా ఉండేందుకు వీలుగా అధికారులు, సిబ్బందిని రెండు బ్యాచులుగా వి భజించారు. 900 మంది చొప్పున రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక బృందం సాయంత్రం 7గంటలకు విధులు ముగించుకొని వెళ్లగా, మరో బృం దం మరుసటి రోజు ఉదయం వరకు కౌంటింగ్‌లో పాల్గొంటుంది. గురువా రం సాయంత్రానికే ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ పూర్తి చేసే లక్ష్యంతో రిటర్నింగ్ అధికారి,నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ఏర్పాట్లు చేశారు.

ద్వితీయ ప్రాధాన్యమే కీలకం

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డితో పాటు స్వతంత్ర అభ్యర్థి అశోకుమార్ మధ్య బలమైన పోటీ నడిచింది. మొదటి ప్రాధాన్య ఓట్ల అనంతరం వీరిలో ఎలిమినేట్ అయ్యే అభ్యర్థులకు వచ్చే ద్వితీయ ప్రాధాన్య ఓట్లే కీలకమయ్యే అవకాశం ఉంది.

పటిష్ఠ భద్రత

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఎస్పీ చందనాదీప్తి ఆధ్వర్యంలో పోలీస్‌శాఖలోని అన్ని ర్యాంకులకు చెందిన 800మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఒక్కో కౌంటింగ్ హాల్ వద్ద డీఎస్పీ ర్యాంకు అధికారి బందోబస్తును పరిశీలిస్తున్నారు.

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందనతో పాటు అధికారులు, పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలు తెరచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌లోకి తరలించారు. కౌంటింగ్ సరళిని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు పరిశీలించారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పరిశీలకుడు రాహుల్‌బొజ్జ, ఆర్వో హరిచందన, ఎస్పీ చందనాదీప్తి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



క్రీడాకారులతో ఎంబీఏ సభ్యులు

మిర్యాలగూడటౌన్, జూన్5: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్ అన్నారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సెలవుల్లో క్రీడాసాధన చేయాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోచ్ రామకృష్ణ, అంజయ్య, రవికిరణ్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చామల

యాదాద్రి, జూన్5(ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎంపీగా గెలుపొందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా గెలుపొందిన చామలను, భారీ మెజార్టీ వచ్చేందుకు కృషిచేసిన ఎన్నికల ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలను సీఎం అభినందించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కిరణ్‌కుమార్‌రెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చామల, రాజగోపాల్‌రెడ్డి, కుంభం, అయిలయ్య

బంగారు దుకాణంలో ఐటీ అధికారుల దాడులు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 5: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శ్రీదేవి ట్రేడర్స్ బంగారు దుకాణంలో ఐటీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఏపీలోని కావలి టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ బస్సులో ఐదుగురు మహిళలు తరలిస్తున్న రూ.1.61 కోట్ల నగదు, వెంకటాచలం టోల్‌గేట్ వద్ద రూ. 90లక్షలు విలువైన కేజీ 658 గ్రాముల బంగారాన్ని పోలీసులు ఇటీవల స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదు, బంగారాన్ని పోలీసులు ఐటీ అధికారులకు అప్పగించారు. తరలిస్తున్న బంగారానికి సంబంధించిన బిల్లులపై మిర్యాలగూడలోని శ్రీదేవి ట్రేడర్స్ చిరునామా ఉండడంతో విచారణ చేపట్టిన అధికారులు మిర్యాలగూడ పట్టణానికి వచ్చి దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. దుకాణంలోని రికార్డులను మూడు గంటలకు పైగా పరిశీలించిన ఐటీ అధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించకుండానే వెనుదిరిగారు. పట్టణంలో ఐటీ దాడులు జరుగుతున్నాయని తెలుసుకున్న వ్యాపారులు దుకాణాలను మూసి వేసి పార్లమెంట్ ఎన్నికల ఫలితాల విశ్లేషణలో పడ్డారు.



బ్యాలెట్ బాక్సులు తీసుకెళ్తున్న సిబ్బంది



తీన్మార్ మల్లన్న, రాకేశ్‌రెడ్డి కరచాలనం



కౌంటింగ్ హాల్‌లో అభ్యర్థులు



కలెక్టర్ సమక్షంలో స్ట్రాంగ్ రూం తెరుస్తున్న అధికారులు

కౌంటింగ్ ప్రక్రియ షురూ..

వరంగల్ - ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. జిల్లాకేంద్రం సమీపంలోని అనిశెట్టిదుప్పలపల్లి గోదాముల్లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను నల్లగొండ జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన పర్యవేక్షణలో కౌంటింగ్ హాల్‌కు తరలించారు. పోలింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతను ఎస్పీ చందనదీప్తి పర్యవేక్షిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్‌మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిలు కౌంటింగ్‌లు సరళిని పరిశీలించారు.

ఆటో, పాల ట్యాంకర్ ఢీ.. నలుగురికి గాయాలు

భువనగిరి రూరల్ జూన్ 5: ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్ ఆటోను ఢీ కొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రం శివారులోని రాయిగిరిలో బుధవారం జరిగింది. రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు చెందిన ఆటో డ్రైవర్ షేక్‌లాల్ మహ్మద్ యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరుకు చెందిన నర్సింహ, అతని భార్య సౌమ్య, తల్లి ప్రమీలను ఆటోలో భువనగిరికి తీసు కొస్తుండగా మార్గమధ్యలోని రాయిగిరి సర్వీస్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్ ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ఆటో నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను భువనగిరి ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మద్దిరాల, చౌటుప్పల్‌లో భారీ వర్షం

● మద్దిరాలలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం ● పిడుగుపాటుకు 21 మూగజీవాలు మృత్యువాత



చౌటుప్పల్ పట్టణంలో కురుస్తున్న వర్షం

చౌటుప్పల్ టౌన్, పెద్దవూర, వలిగొండ, జూన్ 5: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లా మద్దిరాలలో, యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో బుధవారం సాయంత్రం రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. మద్దిరాలలో ఐదు సెంటీమీటర్లు, చౌటుప్పల్‌లో నాలుగు సెంటీమీటర్ల వర్షపాతం కురియటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం నుంచి ఎండతో ఇబ్బందులు పడిన ప్రజలు ఉపశమనం పొందారు. పది రోజుల క్రితం విత్తిన పత్తి విత్తనాలకు ఈ వర్షం జీవం పోసింది. వలిగొండ మండలంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా చల్లపడి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు కొద్దిసేపు అంతరాయం కలిగింది.



పెద్దవూర మండలం పూల్యాతండాలో పిడుగుపాటుతో మృతిచెందిన మేకలు

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పూల్యాతండా, నీరుటువానిగూడెం గ్రామాల్లో మంగళవారం రాత్రి పిడుగుపాటుకు 20మేకలు మృత్యువాత పడ్డాయి. కుంకుడుచెట్టు గ్రామపంచాయతీలో నీరుటువానిగూడెంలో గ్రామానికి చెందిన నీరుటు సైదయ్యకు చెందిన ఎద్దు ఆరుబయట చెట్టుకు కట్టేయగా పిడుగుపాటుకు గురై మృతిచెందింది. సూర్యాపేట జిల్లాలో బుధవారం 40.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా మద్దిరాలలో 40.9డిగ్రీలు, చిలుకూరు మండలంలో అత్యల్పంగా 37.7డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పవన్‌మోటార్స్ కారు షోరూంలో చోరీ

● రూ.3.77లక్షలు అపహరణ

మిర్యాలగూడ అర్బన్, జూన్ 5: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని పవన్ మోటార్స్ కారు షోరూంలో దొంగతనం జరిగింది. దొంగలు లాకర్‌ను ధ్వంసం చేసి రూ.3.77లక్షల నగదును ఎత్తుకెళ్లారు. టూటౌన్ సీఐ నాగార్జున బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి- అద్దంకి బైపాస్‌రోడ్డులో పవన్‌మోటార్స్ కారుషోరూంలో అకౌంటెంట్ దుస్సా రేణు ఈ నెల 2వ తేదీన వచ్చిన లావాదేవీల్లో రూ. 3.77లక్షల నగదును క్యాష్ కౌంటర్‌లోని మినీ లాకర్‌లో భద్రపరిచి ఇంటికి వెళ్లారు. 3వ తేదీ తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖాలకు మాస్క్ ధరించి షోరూం షట్టర్ తాళాలు తెరచి లోపలికి ప్రవేశించారు. అకౌంటెంట్ ఛాంబర్‌లోకి వెళ్లి అక్క ఉన్న ఇనుప లాకర్‌ను ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. షోరూంను శుభ్రపరిచేందుకు సోమవారం ఉదయం వచ్చిన స్వీపర్ రమణ లాకర్ పగిలి ఉండడాన్ని గమనించి అకౌంటెంట్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చింది. దీంతో అకౌంటెంట్ రేణు షోరూం వద్దకు చేరుకొని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అకౌంటెంట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. షోరూంలోని సీసీ కెమెరాల్లో సోమవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు చోరీ చేస్తున్నట్లు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూన్ 5: యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్ర నామార్చన జరిపారు. ప్రధా నాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరు కల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయ ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచా ర్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయి ద్యాల నడుమ వైభవంగా జరిపారు. కొండపైన శివాలయంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 27,46, 342 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

సూర్యాపేటక్రైం, జూన్ 5: మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో బుధవారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో నివాసముండే చామల శ్రీనివాస్(48) పెయింటర్‌గా పని చేస్తుంటాడు. అతను కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం పెయింటింగ్ పనికోసం వెళ్తన్నానని ఇంటి నుంచి బయలు దేరాడు. పనికి వెళ్లకుండా జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వర థియేటర్ సమీపంలో మురుగు కాల్వ పైన ఏర్పాటు చేసిన బండపై కూర్చున్నాడు. ఆ సమయంలో మూర్ఛ రావ డంతో శ్రీనివాస్ మురుగు కాల్వలో పడి మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..

చివ్వెంల, జూన్ 5: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ఐలాపురం స్టేజీ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సున్న గుర్తుతెలియని మహిళ ఐలాపురం స్టేజీ వద్ద కొద్ది రోజులుగా బిక్షాటన చేస్తుంది. మంగళవారం రాత్రి ఐలాపురం స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. మహిళా సుమారు ఎత్తు ఐదు అడుగులు, చామనఛాయ, మృతదేహంపై కాషాయరంగు చీర, గ్రీన్‌కలర్ జాకెట్ ఉంది. మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం కోసం సెల్: 8712686031లో సంప్రదించాలని తెలిపారు.

చికిత్సపొందుతూ..

అనంతగిరి, జూన్ 5: రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ నవీన్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని వాయిల సింగారం గ్రామానికి చెందిన కలకొండ సత్యం(48) కోదాడలో గల ద్వారకా రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. గత నెల 30న పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా వెంకట్రాంపురం గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సత్యం భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుల అరెస్టు

నేరేడుచర్ల, జూన్ 5: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం లాల్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ బుధవారం తెలిపారు. నిందితులు వానరాశి రాములు, యడవెల్లి యాదగిరిలను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

హుజూర్‌నగర్, జూన్ 5: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన అస్మా అనే యువతి అదృశ్యమైంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అస్మా ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోగా బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎటో వెళ్లిపోయిందని తల్లి పర్వీన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా కానిస్టేబుల్‌కు తేలుకాటు

నల్లగొండ, జూన్ 5: నల్లగొండ జిల్లాకేంద్రం పట్టణ సమీపంలోని దుప్పలపల్లి గోదాము సమీపంలోని వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఎమ్మెల్సీ కౌంటింగ్ సెంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్‌కు బుధవారం రాత్రి తేలు కుట్టింది. మీడియా సెంటర్ సమీపంలో విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ వరలక్ష్మి తేలుకాటుకు గురికావడంతో ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం నల్లగొండ పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత

నల్లగొండటౌన్, చిట్యాలరూరల్, కట్టంగూరు, నాగార్జునసాగర్, జూన్ 5: మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకమని, ఈ అంశంలో అందరూ సమష్టి బాధ్యత వహించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సురేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో వాకర్స్‌తో ర్యాలీ నిర్వహించి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు, బెల్లి యాదయ్య, పర్యావరణవేత్త సురేష్‌గుప్తా అధికారులు పాల్గొన్నారు.



నల్లగొండలో ర్యాలీలో పాల్గొన్న పర్యావరణ ప్రేమికులు

ఎఫ్‌సీఐ కార్యాలయంలో...

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయ ప్రాంగణంలో డీఎం సుశీల్‌కుమార్‌సింగ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పచ్చదనాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇబ్బడిముబ్బడిగా వాడుతున్న రసాయన ఎరువుల వల్ల భూసారం గణనీయంగా తగ్గి, లోతట్టు ప్రాంతాల్లో వరదలు వంటి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని అన్నారు. వాటి నివారణకు ప్రతీ పౌరుడు తనవంతుగా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఆ విషయంలో సంస్థ కృషిని తెలియజేస్తూ, భారత ఆహార సంస్థ గోదాముల్లో పచ్చదనాన్ని నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ, పరిరక్షిస్తున్నామని తెలిపారు. అంతేకాక సంస్థ కార్యకలాపాల్లో ఆకుపచ్చ పాదముద్రను పెంచేందుకు సంస్థలో పూల బొకెలకు బదులు మొక్కల పంపిణీని, చిరుధాన్యాలు ఉత్పత్తులను పెంపొందిస్తున్నమని ఆయన వివరించారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు రఘుపతి, కెఎన్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని ఉరుమడ్లలో ఉపాధి హామీ కూలీలు, రైతులకు పర్యావరణ పరిరక్షణపై ఈజీఎస్ ఈసీ జీడిమడ్ల మల్లేష్ అవగాహ న కల్పించారు. కాలుష్యాన్ని నివారించి సకాలంలో వర్షాలు కురిసేలా చే స్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కాలుష్యాన్ని నివారించి సకాలంలో వర్షాలు కురిసేలా చేస్తా యన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్ది వీర సోమయ్య, ఎఫ్ఏ రమేష్, లీలావతి, అశోక్, జగన్, రామేశ్వరి, యాదమ్మ, మారయ్య ఉన్నారు.


మొక్క నాటుతున్న డీఎం


అవగాహన సదస్సులో పాల్గొన్న యువకులు

● కట్టంగూరులోని రైతు వేదిక భవనంలో కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త మాట్లాడుతూ వ్యవసాయరంగం అత్యంత ప్రాధాన్యం కలిగిన విభాగంగా ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు, సుస్థిర వ్యవసాయం చీడపీడల నిర్వహణ, అధిక సాంద్రత పద్ధతులను అవలంబిస్తూ విత్తనాలను విత్తుకోవడం ద్వారా ఎక్కువ దిగుబడులను సాధించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ మహేష్, సిబ్బంది నరేష్, అంజయ్య, పరుశురాం, రైతులు యాదయ్య, నర్సింహ్మా, యాదగిరి, శ్రీను పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్‌లో నందికొండ మునిసిపల్ కమిషనర్ శ్రీను కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమవంతుగా ఐదు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ అన్నపూర్ణ, మోహన్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


నందికొండ మునిసిపాలిటీలో మొక్కలు నాటుతున్న కౌన్సిలర్లు, సిబ్బంది

నీట్ ఫలితాల్లో 'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ


సాయిచరణ్


శ్రీలేఖ


శ్రీ నందన

నల్లగొండరూరల్, జూన్ 5: నీట్ 2024 ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కె.సాయిచరణ్ 610వ ర్యాంకు, బి.శ్రీలేఖ 587, శ్రీనందన 581, డి.సాయిప్రసాద్ 559, ఎన్.రూపాంజలి 555, ఎం. మనోజ్ 551, బి.నవీన్ 549, డి.దూపంత్‌కుమార్ 547, జె.యశ్వంత్ 538, అఫ్రాముస్కాన్ 532, ఎన్.దినేష్ 519, ఆర్.చందన దుర్గ 514, డి. హనుమంతు 495, మహేంద్ర 482, సంతోష్ 475, ఎం.మోహన్ 474, అనురాధ 472, వై.వంశీ 464 మార్కులను సాధించారు. విద్యార్థులు సాధించిన ఫలితాల్లో ప్రగతి జూనియర్ కళాశాల జిల్లాలో ది బెస్ట్ కళాశాలగా నిలిచింది. ప్రగతి జూనియర్ కళాశాలను ప్రగతి పథంలో నిలిపినందుకు దానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్ ఎ. నరేందర్‌బాబు, ఎన్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన విద్యాబోధన, అంకితభావంతో కృషి చేసి అధ్యాపక బృందం కృషి వల్లే ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో ఐఐటీ, జెఈఈ(అడ్వాన్స్) నీట్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించడమే నూతన బ్యాచ్‌లను ప్రారంభించినట్లు తెలిపారు.

నీట్‌లో 'జాస్రిత' విద్యార్థుల ప్రభంజనం


అఫ్రా ముస్కాన్


అబ్దుల్ రహమాన్


ఇశాత్ ఫాతిమా


ఫైజా ఆఫ్రీన్

నల్లగొండటౌన్, జూన్ 5: నీట్ -24 ఫలితాల్లో నల్లగొండలోని జాస్రిత అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అకాడమీకి చెందిన అఫ్రా ముస్కాన్ 532, అబ్దుర్ రహమాన్ 511, నిశాత్ ఫాతిమా 506, ఫైజా ఆఫ్రీన్ 501, సౌజన్య 496, ఫహాద్ 475, జిక్రా 475, మనస్విని 473, అనశార 462, అక్షర 444, శివాని 444, మారియా 441, లూబనా అంజుం 432, వైష్ణవి 431, సౌమ్య 430, ఆఫియా 425, ఆర్షియా 422, వర్షిత 421, సానియా 417, అర్షితశ్రీ 412, అనువర్థిక 407, అర్చన 397 వంటి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని యాజమాన్యం అభినందించింది.

నీట్ ర్యాంకర్లను అభినందించిన ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్, జూన్ 5: నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించడం నియోజకవర్గానికే గర్వకారణమన్నారు. ఆలిండియా స్థాయిలో బి.మేఘన 5959 ర్యాంకు సాధించగా, బి.అద్విత్‌కృష్ణ 6124 ర్యాంకు సాధించాడు. ఇరువురితో పాటు ఉత్తమ బోధన చేసిన అధ్యాపకులను ఎమ్మెల్యే అభినందించారు. క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో అత్యుత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బికుమళ్ల కిరణ్‌కుమార్, డైరెక్టర్లు పీఎల్ఎన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



కేఎల్ఎన్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

నీట్ ర్యాంకర్‌కు అభినందన

నీట్ ఫలితాల్లో జాతీయస్థాయి 18వ ర్యాంకు సాధించిన భూక్యా సిరివెన్నెలను బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించిన సిరివెన్నెల ప్రతిష్ఠాత్మక నీట్ పరీక్షలలో జనరల్ కేటగిరిలో 4125వ ర్యాంకు, ఎస్టీ కేటగిరిలో ఆలిండియా 18వ ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు. సిరివెన్నెల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు శ్రీనివాసరావు, బుజ్జిలను సంఘం నాయకులతో కలిసి అభినందించారు.

నీట్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థిని

గుర్రంపోడు, జూన్ 5: మండలంలోని తుర్కేని బావి గ్రామానికి చెందిన వి ద్యార్థి నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. మండలంలోని పేద కుటుంబానికి చెందిన గాదెపాక రూప మంగళవారం వెల్లడించిన ఫలితాల్లో 720 మార్కులకు గాను 420 మార్కులు సాధించి ఎస్సీ విభాగంలో 29,897వ ర్యాంకు సాధించింది. గాదెపాక రూప 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు కొండమల్లేపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించింది. రూప ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు లింగయ్య, పుష్ప దంపతులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


రూప

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చండూరు, జూన్ 5: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ ఎంపీపీ, మునిసిపల్ కౌన్సిలర్ తోకల వెంకన్న అన్నారు. వేసవిశిబిరం ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు, ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. క్రీడల్లో తైక్వాండో క్రీడ ఎంచుకుని క్రమ శిక్షణతో ప్రతి రోజూ సాధన చేయాలని సూచించారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన విన్యాసాలను తిలకించి వారికి బెల్టులు, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు నర్సింహ, డాక్టర్ నర్సింహ, గొట్టిపర్తి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు టై, బెల్టులను అందజేస్తున్న మాజీ ఎంపీపీ వెంకన్న

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కట్టంగూరు, జూన్ 5: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కట్టంగూరు ఎస్ఐ శ్రీను సూచించారు. మండల కేంద్రంలో బుధవారం సైబర్‌క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని ఫోన్ కాల్ వచ్చినప్పుడు బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ నెంబర్ కానీ ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, రాంమోహన్‌లతో పాటు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోని మరుగుదొడ్లు ధ్వంసం

చందంపేట, జూన్ 5: చందంపేట మండలం చిత్రియాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణం ఉన్న మరుగుదొడ్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు స్థానికులు మండల విద్యాధికారికి బుధవారం సమాచారం అందించారు. మండల విద్యాధికారి సామ్యనాయక్ పోలీసుకుల ఫిర్యాదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.


పాఠశాలలో ధ్వంసమైన మరుగుదొడ్ల నిర్మాణం

విద్యుత్ సమస్యలపై గరంగరం

● ట్రాన్స్‌కో సిబ్బందిపై మండల సభ్యుల ఆగ్రహం

కట్టంగూరు, జూన్ 5: విద్యుత్ సమస్యలతో మండల సభ గరంగరంగా మారింది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు ట్రాన్స్‌కో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి మాట్లాడుతూ మునుకుంట్ల గ్రామంలోని మహారాజుల కాలనీలో 8 నెలల క్రితం కరెంటు స్తంభాలు పాతారని ఇప్పటివరకు తీగలు ఏర్పాటు చేయలేదని అన్నారు. కానీ జనరల్ బాడీలో ఇచ్చిన ఎజెండాలో తీగలు లాగినట్లు చూపించడం ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు మునుకుంట్ల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు 120 కరెంటు స్తంభాలు నేలకు ఒరిగాయని ఇప్పటివరకు 70 స్తంభాలు అందించారని సభలో లేవనెత్తారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ట్రాన్స్‌కో సిబ్బందిని ఎంపీపీ జెల్లా ముత్తి లింగం ఆదేశించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

నార్కట్‌పల్లి, జూన్ 5: ఉపాధిహామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలను కల్పించాలని, దినసరి కూలీని రూ.600లకు పెంచాలని, ఇతర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం నార్కట్‌పల్లి ఏపీవోకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న చెల్లింపుల కోసం ఈ నెల 8వ తేదీన నల్లగొండలోని ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య అన్నారు. పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి చట్టాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇందులో భాగంగానే బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులను కోత పెట్టారని విమర్శించారు. ఆ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధి కార్మికులపై ఉందన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 8వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు చెర్కు పెద్దులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న, మండల కార్యదర్శి దండు నాగరాజు, దండు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఏపీవోకి వినతిపత్రం అందజేస్తున్న నారి అయిలయ్య

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా, జూన్ 5: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం హజారీగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవానికి ఆయన హాలియా మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సహకారంతో మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు కాకునూరి నారాయణ, పిల్లి ఆంజనేయులు, చింతల చంద్రారెడ్డి, దేవాలయ చైర్మన్ మన్నెం కృష్ణమూర్తి, కుంటిగొర్ల శ్రీనివాస్, నాగెండ్ల మట్టారెడ్డి, నాగెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కేవీ రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అనుముల మండలం నాయుడుపాలెం వేంకటేశ్వర క్యాంపులో అభయాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి బధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, రావుల చినబిక్షం, రావుల శ్రీనివాస్, రావుల రాంబాబు, చిరంజీవి, సూర్యరావు, సత్యనారాయణ ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారులపై చిన్నచూపు తగదు

నల్లగొండటౌన్, జూన్ 5: తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు ముస్తఫా అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫోరం నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.15 వేల పింఛన్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఉద్యమకారులను గుర్తించి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆహ్వానించడం శుభసూచకమన్నారు. అయితే ఇదే క్రమంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సైతం అమలు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. సమావేశంలో మలిదశ ఉద్యమకారులు దాసరి వెంకన్న, అద్దంకి రవి, వల్కి వెంకటేశం, కె.శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, పందిరి సైదులు, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

జగన్ నియంతపాలన అంతమైంది: టీడీపీ

నల్లగొండ, జూన్ 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదేళ్ల జగన్ నియంత పాలన అంతమైందని, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నాయకత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్వీయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో బుధవారం కేక్ కట్ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కూరెళ్ల విజయ్‌కుమార్, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

శిక్షణా శిబిరాలతో ఎంతో ఉపయుక్తం

నల్లగొండటౌన్, జూన్ 5: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమని మండల విద్యాధికారి కత్తుల అరుంధతి అన్నారు. జిల్లా బాలభవన్, నాగార్జునసాగర్ బాలకేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 42 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ అనిత, బాలసదనం పర్యవేక్షకురాలు ప్రణీత, నాగార్జునసాగర్ బాలభవన్ పర్యవేక్షకుడు బాలు, శిక్షకులు ఉపేంద్రాచారి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, ఫజల్‌బేగం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంఈవో అరుంధతి

'సీజ్ చేసిన పుస్తకాలను పేద విద్యార్థులకు పంచాలి'

మిర్యాలగూడ టౌన్, జూన్ 5: విద్యాశాఖాధికారులు సీజ్ చేసిన పుస్తకాలను పేద విద్యార్థులకు పంపిణీ చేయాలని సామాజిక కార్యకర్త సరికొండ రుషికేశ్వరరాజు అన్నారు. బుధవారం పాఠశాల ఎదుట మాట్లాడుతూ ఇటీవల కృష్ణా కాలనీలలోని ఓ కార్పొరేట్ పాఠశాల సమీపంలోని ఒక నివాసగృహంలో భారీగా నిల్వ ఉన్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను ఎంఈవో కార్యాలయ ఉద్యోగులు సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన పుస్తకాలను పేద విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చిలుముల కొండలు, దేవులపల్లి కార్తీక్‌రాజు, ఉప్పుతల మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: దేవరకొండలో వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కూరగాయల మార్కెట్ మంజూరైనా అధికారులు స్థల సేకరణ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

గట్టుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మరోసారి రుజువైందని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. భువనగిరి ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడం హర్షించదగిన విషయమని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు టేకుమట్ల శ్రీరాములు, యాదగిరిరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లు, గెలుపునకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు పార్టీ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఏ.సిరాజ్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

కనగల్: మండలంలోని బుడుమర్లపల్లి గ్రామంలో గల సీతాసమేత శ్రీరామచంద్ర, లక్ష్మణ, భక్తాంజనేయ, భవానీశంకరస్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీన శుక్రవారం మండల పూజను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం గణపతి పూజ పుణ్యాహవాచనం, అభిషేకాలు, హోమ పూజలు జరుగుతాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నార్కట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఎండీ. సయ్యద్‌కు తోటి స్నేహితులు అండగా నిలబడ్డారు. అతనికి రూ.32వేల ఆర్థికసాయం అందజేశారు. ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడటంతో సయ్యద్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయనకు శస్త్రచికిత్సకు రూ.3 లక్షలు అవుతాయని వైద్యులు తెలిపారు. దీంతో నార్కట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ -2000 బ్యాచ్‌కు చెందిన క్లాస్‌మేట్లు రూ.32 వేలను సేకరించి తమవంతు అందజేశారు. కార్యక్రమంలో ఎన్.యుగంధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, లింగయ్య, సుధాకర్, రమేశ్, జానయ్య, శ్యాం, దుర్గ, స్వప్న, భరత్‌భూషణ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నాగలక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు తండు సైదులుగౌడ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలతో నల్లగొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధి బల్గూరి వెంకన్నగౌడ్ ఆస్పత్రికి వెళ్లి సైదులుగౌడ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం బాధితుడి భార్యకు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కొమ్మగాని వెంకన్నగౌడ్ ఉన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామానికి చెందిన చిట్యాల రాములు మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పొనుగోటి చొక్కారావు కుమారుడు వేణురావు గ్రామానికి చేరుకొని రాములు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ మండల నాయకులు నాంపల్లి జగన్, కేసాని పూర్ణయ్యలు తమవంతుగా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ గడ్డమీది సైదులు, నాయకులు చిట్యాల వెంకటయ్య, చింతకాయల అంజయ్య, సోమయ్య, సులేమాన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మునుగోడురూరల్: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన వేదిరే పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరే మేఘరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొంపెల్లి గ్రామ అభివృద్ధికి మీవంతుగా సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఎంపీ గారు కొంపల్లి గ్రామ అభివృద్ధికి తప్పకుండా తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు.

గ్రామీణ వైద్యులపై దాడులను అరికట్టాలి

శాలిగౌరారం, జూన్ 5: ఏళ్ల తరబడి రాత్రినక పగలనక గ్రామీణ ప్రాంతంలో గ్రామీణ వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నామని, తమపై దాడులు చేయడాన్ని అరికట్టాలని జిల్లా సీనియర్ గ్రామీణ వైద్యుడు వీపూరి పరాంకుశం ఆందోళన వ్యక్తం చేశారు. శాలిగౌరాంలో మండల గ్రామీణ వైద్యుల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు దునక వెంకన్న, బండారు ధనుంజయ, మండల అధ్యక్షుడు మాదు వెంకన్న, మహేష్, సీహెచ్.అశోక్, నర్సింహాచారి, శీలం శంకర్, వెంకటనర్సయ్య, దామెర్ల శ్రీనివాస్, దొనకొండ అంజి పాల్గొన్నారు.

ఎంపీకి పలువురి అభినందనలు

నాగార్జునసాగర్, జూన్ 5: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీగా గెలుపొందిన కుందూరు రఘువీర్‌రెడ్డికి బుధవారం సాగర్ హిల్‌కాలనీలో ఆయన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో ఎంపీ నివాసానికి చేరుకున్న నాయకులు బొకేలు, పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, లింగారెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.


ఎంపీ రఘువీర్‌రెడ్డిని అభినందిస్తున్న నాయకులు